# బాబూ! నన్ను తీసుకెళ్ళవూ?

దోనేపూడి ప్రేమ్‌దులారి




"బాబూ ! నన్ను తీసుకెళ్ళవూ ? అంటూ శర్మగారు తన ఆరుగురు కొడుకులకూ —విడివిడిగా రాయించిన ఉత్తరాల్లో ఇది ఆరవది. తనకి కళ్ళు సరిగ్గా కనిపించక పోవడంతో ఎవర్నో ఒకర్ని బ్రతిమాలి ఇలా కొడుకులకు ఉత్తరాలు రాయించడం, వాళ్ళు జవాబు కూడా రాయకుండా వూరుకోవడం పరిపాటే.

కానీ ! ఆ కన్న తండ్రి హృదయం వాళ్ళు తనని నిర్లక్ష్యం చేస్తున్నారని పరితపించదు; వాళ్ళకా ఉత్తరాలు అందలేదేమో ! వాళ్ళ పరిస్థితులు ఎలా ఉన్నాయో ! పని ఒత్తిడి ఎక్కువగా ఉండి జవాబు రాయలేకపోతున్నారేమో ! ఇలా ఆయన ఊహిస్తుంటే ముసలాడు తమ పరువు తీస్తున్నాడని, వేధిస్తున్నాడని ఆ కొడుకులు తండ్రి మీద కోపం పెంచుకుంటున్నారు. తండ్రి కళ్ళు కనిపించడంలేదంటూ ఊళ్ళో ఎవరెవరినో బ్రతిమాలి తమకు ఉత్తరాలు రాయించడం వల్ల తమ విషయాలు అందరికీ తెలిసిపోతున్నాయని వాళ్ళకి కోపం. ... అందుకే ఆ ఊరు రావడం కూడా మానుకున్నారు.

తన తండ్రి ఎంతో కష్టపడి కట్టించిన ఇల్లది. ఉద్యోగం చేస్తున్నన్నాళ్ళూ ఎన్నో ఊళ్ళు తిరిగాడు. బదిలీల రీత్యా అంటే రిటైరైన తర్వాత అక్కడ ఉండడమే శర్మ గారికి ఇష్టం.

కొడుకులందరికీ రెక్కలు వచ్చాయి. రెక్కలు వచ్చిన ఒక్కో పక్షి తన నుంచి దూరంగా ఎగిరిపోయింది. పెన్షన్ వస్తుండడంతో తను డబ్బు కోసం ఎవరి మీదా ఆధారపడనక్కర్లేదు. కానీ వయసు పెరుగుతోంది.శరీరం సహకరించడం క్రమక్రమంగా మానేస్తోంది. తన వాళ్ళ మీద ఆధారపడక తప్పని పరిస్థితి ! అంతకన్నా ఎక్కువగా తన పిల్లలతో కలిసి ఉండాలని తపన !!

పెద్దాడికి ఆ ఉత్తరం పోస్ట్ చేసినప్పటి నుంచి ఆయన ఇంటి అరుగుల మీదే మకాం. పెద్దాడొస్తున్నాడని ఎదురు చూపు ...!

"వాడొస్తే లోపలికి రాడా... ఆ అరుగుల మీదే పడుండడం ఎందుకు ? లోపలికి రండి..." భార్య రుక్మిణమ్మ మందలింపులు ఆయనకి అలవాటై పోయాయి.

అలా ఒక వారం గడిచిన తర్వాత రెండో వాడికి ఉత్తరం "బాబూ ! నన్ను తీసుకెళ్ళవూ ?" బాబూ...!

"మరో వారం ఎదురు చూపులు...!"

మూడవ వాడికి ఉత్తరం ... "బాబూ ! .... నన్ను తీసుకెళ్ళవూ ?...

"ఎదురు చూపులు..."

"నిరాశా, నిస్పృహ..."

"నాలుగో కొడుకుకి ఉత్తరం....."

"—ఇలా రోజులు నెలలుగా, నెలలు సంవత్సరాలుగా మారుతున్నాయిగాని ఆరుగురిలో ఒక్కరూ ఆయనని తీసుకువెళ్ళడానికి రాలేదు సరికదా చూడడానికి వస్తే ఎక్కడ వెంటపడతాడో నని చూడడానికి రావడం మానుకున్నారు. అడపాదడపా ఉత్తరాలు మాత్రం రాస్తుండేవారు... ఆయన ఆరోగ్యం ఎలాగుందని పరామర్శిస్తూ మాత్రం కాదు తమ భార్యకి బావుండలేదనో, పిల్లకి జ్వరాలు వచ్చాయని, ఆఫీస్‌లో పని ఒత్తిడి ఎక్కువగా ఉందనో ! ఇలాంటి ఉత్తరాలు వచ్చినప్పుడు వాళ్ళ మీద కోపం వచ్చేదికాదు. ఆ కన్న తండ్రికి —వాళ్ళెలా బాధపడిపోతున్నారోనని తల్లడిల్లిపోయేవాడు !

"నీకేమి కావాలో నేను చూడడంలేదా ? వాళ్ళకెందుకు రాస్తున్నావ్..." రుక్మిణమ్మ గారికి భర్త ప్రవర్తన కోపం తెప్పిస్తుండేది.

"భార్య చిరు బుర్రులాడినప్పుడల్లా ఆయన చిన్న చిరునవ్వు చిందించి ఊరుకునేవారు మనకి వాళ్ళు పెట్టాలటే ! నా పెన్షన్ చాలు. మనిద్దరం బ్రతకడానికి... ఇంత కాలం నా దగ్గర పెరిగిన వాళ్ళు రెక్కలు వచ్చి ఎగిరిపోయారు. వాళ్ళ రెక్కల నీడన నా అలసట తీర్చుకోవాలని..." ఆ పిచ్చి తండ్రి తపనకి ఆవిడకి కన్నీళ్ళొచ్చేవి.

ఎక్కువ మంది పిల్లలుంటే కష్టాలేమిటో ఆవిడకి ఇప్పుడు బాగా తెలిసొచ్చింది. ఒక్కడే ఉంటే ఇక తప్పదన్నట్లయినా వాడు తల్లిదండ్రుల బాధ్యతని చేపట్టేవాడు. ఎక్కువ మందుంటే వాడు చూసుకుంటాడని వీడు, వీడు చూసుకుంటాడని వాడూ —అందరూ తప్పించుకుంటారు. జరుగుతున్నతంతదే !

ఆవిడ కళ్ళు చెమ్మగిల్లాయి.

భర్త చూడకుండా చెంగుతో కళ్ళద్దుకుందావిడ.

"రండి ... వడ్డించాను..." భార్య పిలుపుతో లోపలికి బయల్దేరారు శర్మ గారు.

తినడం ... అరుగు మీద కూర్చోవడం... దారిన పోయే వాళ్ళని పలకరించడం... తినడం... పడుకోవడం... బాధగా అనిపించింది. శర్మగారు మనుమలతో ఆడుకోవాలని, కొడుకుల పరామర్శలని ఒదుకోవాలని ఆయన ఆరాటం, ఆరాటంగానే మిగిలిపోతోంది. జీవన పోరాటంలో ఓడిపోతున్నట్లు ఆయన కృంగిపోతూనే వున్నారు.



సముద్రంలో ఉండే చేపలకి చెమట పడుతుందా! అడిగింది టీచర్.
'పడుతుంది మేడమ్' అంది అరుణ
ఎలా!
అవి చెమటొడ్చబట్టేగదా సముద్రపు నీరు ఉప్పుగా తయారయ్యేది.

అవంతి
మల్లిఖార్జుననగర్

భోజనం చేస్తున్నప్పుడే కాదు —భార్యా భర్తలు ఏమి మాట్లాడుకున్నా కొడుకుల గురించి, వాళ్ళ కుటుంబాల గురించే ! ఏమి తింటున్నా ఇది వాడి కిష్టం, ఇది వాడికయిష్టమనే ! వాళ్ళ చిన్నప్పటి చేష్టల గురించే ఆ కన్న హృదయాలు ఆలోచించగలిగేవేగాని పెరిగిపోయి స్వార్థంతో నిండిపోయి కన్నతల్లిదండ్రుల్నే భారంగా అనుకుంటున్న మనస్తత్వాల్నిఊహించను కూడా ఊహించలేవు !

రుక్మిణమ్మ గారికి మాత్రం శర్మగారు ఏదో పిల్లాడిలా అనిపించసాగాడు. పిల్లలు రోజు రోజుకీ పెరిగి పారిపోతే —ఈ పిల్లవాడు రోజు రోజుకీ పసిపిల్లాడైపోతున్నాడు. ఈ పసిపిల్లాణ్ణి ఆలనాపాలనా చూసుకోవడంతోనే ఆవిడకి సరిపోతోంది. ఆయన ఆలోచనలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. భార్య సాహచర్యంతో సేద తీర్చుకోవడం కన్నా కొడుకుల ప్రతిభని కళ్ళారా చూస్తూ మనుమలతో, మనమరాళ్ళతో ఆడుకోవడం కోసం ఆయన కలలు కంటున్నారు. రోజులు దొర్లిస్తూ నిరీక్షిస్తున్నారు.

ఆ రోజూ అలవాటు ప్రకారం అరుగు మీద కూర్చుని అటుగా పోతున్న ఓ వ్యక్తిని పిలిచి "బాబూ ! నన్ను తీసుకెళ్ళవూ ?" అంటూ కొడుకుకి ఉత్తరం రాయమన్నారు శర్మగారు.

"ఇలా రోజూ నా లాంటి వాణ్ణి పిలిచి ప్రాణం తీసేకన్నా ఓ వందో రెండొందలో "బాబూ ! నన్ను తీసుకెళ్ళవూ !" అని కార్డుల మీద ముద్రించి పెట్టుకోకూడదూ... రోజూ కొకళ్ళ అడ్రస్ రాసి పోస్ట్ చేస్తుండవచ్చు..."

"బాబూ !..." తల్లడిల్లిపోయారు శర్మగారు.

"మరి లేకపోతే ఏమిటి తాతగారూ ! మీరిలా మీ కొడుకుల కెన్ని ఉత్తరాలు రాయించలేదూ ? ఒక్కళ్ళయినా వచ్చారా...?"

"వాళ్ళెన్ని ఇబ్బందుల్లో ఉన్నారో... ఆఫీస్ పని ఒత్తిడి, పిల్లల ఆరోగ్యాలు —వాళ్ళ సమస్యలు వాళ్ళకుంటాయి కదా బాబూ ..." తన కొడుకుల్ని పరాయి వ్యక్తి అనుమానించేసరికి భరించలేకపోయింది ఆ కన్న హృదయం.

"సర్లెండి... మిమ్మల్ని బాధించడమెందుకూ ? ఇదుగో రాస్తున్నాను... ఎవరికి పోస్ట్ చెయ్యమంటారో అడ్రసు చెప్తే రాసి పోస్ట్ చేస్తాను..."

"వద్దులే బాబూ ... ఆ కార్డు ఇలా ఇవ్వు..." ఆయన కళ్ళు నీటితో నిండిపోయాయి.

"సారీ తాతగారూ... మిమ్మల్ని బాధిస్తే...!"

"ఏం లేదు బాబూ !... థాంక్యూ ఉత్తరం రాసినందుకు..." ఆ ఉత్తరాన్ని అలాగే పట్టుకుని రెండో చేత్తో కర్రను పోటేసుకుంటూ ఇంటి లోపలికి వెళ్ళిపోయారు శర్మగారు.

"ఏమండీ ! భోజనం వడ్డించమంటారా!" రోజూ భోజనం వడ్డించి లోపలికి రమ్మంటేగానీ రాని భర్త తనంతట తాను లోపలికి వచ్చేసరికి ఆశ్చర్యమేసింది రుక్మిణమ్మ గారికి.

"కాస్సేపు పడుకుంటాను... ఓ అరగంట తర్వాత లేపు..." మంచం మీద నెమ్మదిగా వాలిపోయారు శర్మగారు.

"బాబూ ! నన్ను తీసుకెళ్ళవూ ?" ఆయన రాయించుకున్న ఉత్తరాన్ని అలాగే గుండెల మీద పెట్టుకున్నారు.

ఆయన శరీరమైతే ఎవరినీ చూడడానికి వెళ్ళలేకపోయింది, మనసు కొడుకు లందర్నీ వరస బెట్టి పరామర్శించి వచ్చింది. ముఖంలో తృప్తి ! అందరూ ప్రయోజకులయ్యారు ! అదే ఆ కన్న తండ్రి సంతృప్తి ! !

ఆ తృప్తితో మూతలు పడుతున్న ఆయన కన్నులు మరింక తెరుచుకోకుండా మూసుకుపోయాయి. ఈ బాధలకి, బంధాలకి బహుదూర ప్రాంతాలకి వెళ్ళిపోయింది ఆయన మనసు. ఆ శరీరం ఇప్పుడు ఎవర్నీ చూడాలని తపించదు. ఎవ్వరూ దానికక్కర్లేదు !

"బాబూ ! నన్ను తీసుకెళ్ళవూ ?" అంటూ అడ్రస్ లేకుండా ఆయన గుండెల మీద పడున్న ఉత్తరాన్ని దేవుడు అందుకున్నాడేమో ఆ దీనుణ్ణి తీసుకెళ్ళిపోయాడు.

భర్తని భోజనానికి పిలవడానికి వచ్చిన రుక్మిణమ్మ గారు ఆయననలా చూసి కెవ్వున కేకేసి పడిపోయింది.

●